క్లుప్తంగా

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం ముత్తుకూరుకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన పెన్షన్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంత్రి కాకాణి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు.

అల్పాహారం పంపిణీ



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి వృద్ధాశ్రమంలోని వారికి సుబ్బయ్యశెట్టి అనే వ్యక్తి నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా ఆదివారం అల్పాహారాన్ని అందజేశారు.

దుస్తుల వితరణ

కొడవలూరు: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా మండలంలోని నార్సురాజుపాళెంలో ఉన్న సెంటినరీ బాప్టిస్టు చర్చిలో చర్చి సభ్యులు పాటూరు రమేష్, రవి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. 200 మందికి చీరలు, పంచలు, చొక్కాలు పంపిణీ చేశారు. తొలుత ఎంపీపీ గాలి జ్యోతి చర్చి సభ్యులందరికీ కేక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ డాక్టర్ ఎం.ప్రేమ్‌నాథ్, అధ్యక్షుడు బి.సుదర్శనం, సర్పంచ్ బచ్చు సుప్రియ, సభ్యులు జి.సునీల్, బి.శ్రీనివాసులు, టి.అహరోన్ పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



పొగమంచులో వెళుతున్న వాహనాలు

పొదలకూరు: పట్టణాన్ని పొగమంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటల వరకు కూడా మంచు వీడడంలేదు. ఆదివారం ఓ వైపు భానుడు ఉదయించినా మంచు తెరలు తొలగిపోలేదు. ఫలితంగా వాహనచోదుకులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు హడలిపోతున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు

- ఎస్పీ విజయారావు
- రంగడి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన



నెల్లూరు(క్రైమ్): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా చూడాలని ఎస్పీ విజయారావు సూచించారు. రంగనాథస్వామి దేవస్థానం వద్ద బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్, పార్కింగ్ పాయింట్లు, బ్యారికేడ్లను ఆదివారం పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 500 మందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని వివరించారు. సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను నిలిపేలా చూడాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు క్రైమ్ పార్టీలు మఫ్టీలో తిరుగుతూ చోరీలు జరగకుండా చూడాలని చెప్పారు. పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఎస్పీ హిమవతి, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, నగర ఇన్‌స్పెక్టర్లు అన్వర్‌బాషా, సురేంద్రబాబు, సుబ్బారావు, నరసింహారావు, రాములునాయక్, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



ఆత్మకూరు: పట్టణంలోని జ్యోతినగర్‌లో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎం డివిజన్ కన్వీనర్ పట్టెడ మురళీ మాట్లాడుతూ ఏఐఎం వ్యవస్థాపకుడు పీవీ సునీల్‌కుమార్ డీజీపీగా బాధ్యతలు చేపట్టబోతున్న క్రమంలో శౌర్య దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు వివరించారు. ఏఐఎం కార్యవర్గ సభ్యుడు కే సురేష్, పెంచలస్వామి, యానాదయ్య, మల్లికార్జున, కొండయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సంబరాలు

- పెరిగిన పింఛన్ నగదును లబ్ధిదారులకు పంపిణీ చేసిన వలంటీర్లు
- సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



పొదలకూరు: మరుపూరులో పెరిగిన పింఛన్ నగదు లబ్ధిదారుకు అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు

పొదలకూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం సందర్భంగా పింఛనుదారులకు పింఛన్ నగదును మరో రూ.250 పెంచడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత నెల వరకు పింఛన్ నగదు రూ.2,500 అందజేస్తుండగా నూతన సంవత్సరంలో దాన్ని రూ.2,750లకు పెంచారు. పెంచిన పింఛన్ నగదును ఆదివారం ఉదయం వలంటీర్లు వారి పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పొదలకూరు మండలంలో పాత పింఛన్లు 9,837 ఉండగా, కొత్తగా మరో 300 పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తంగా చూసుకుంటే 10,137 పింఛన్లు కొత్త సంవత్సరంలో మండలంలో పంపిణీ చేయాల్సి ఉంది.

ముందుగా కొత్త పింఛన్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ అందజేసి తర్వాత పింఛన్ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 6వ తేదీన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా నగదు అందజేస్తారని తెలిసింది. మరుపూరులో సచివాలయ కన్వీనర్లు మనమల ప్రసాద్, బిరదవోలు కుమారి, నలగర్ల పెంచలయ్య లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నాగయ్య, వలంటీరు సుజాత పాల్గొన్నారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీలో పింఛన్ నగదును వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, మూలి సతీష్ రెడ్డి వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలు, పొదలకూరు పంచాయతీలో సచివాలయ కన్వీనర్లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పింఛను నగదును లబ్ధిదారులకు అందజేశారు. పెరిగిన పింఛన్ నగదును అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెలివిరిసింది.

పండగలా పింఛన్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెల నుంచి పెంచిన రూ.2,750 పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. మండలంలోని వవ్వేరులో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితా ఆధ్వర్యంలో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కేక్ కట్ చేయించి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విడవలూరులో..

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, నాయకుడు పాశం శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పెన్షన్ నగదు పంపిణీ

ముత్తుకూరు: రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి పెన్షన్ల మొత్తం రూ 2,500 నుంచి రూ.2,750లకు పెంచింది. పెరిగిన పెన్షన్ల మొత్తాన్ని ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పండగ వాతావరణంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెన్షన్‌దారులకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పింఛన్ నగదు పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా మామిడిపూడిలో సచివాలయ కన్వీనర్‌లు గౌస్‌బాషా, ఉప సర్పంచ్ సులోచన, వైఎస్సార్‌సీపీ నేత పద్మనాభరెడ్డి తదితరులు పింఛన్ నగదును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పింఛన్ నగదును పెంచినందుకు లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



పొదలకూరు: టైలర్స్‌కాలనీలో పింఛన్ నగదును లబ్ధిదారుకు అందజేస్తున్న వార్డు సభ్యులు



బుచ్చిరెడ్డిపాళెం: వవ్వేరులో కేక్ కట్ చేస్తున్న పింఛన్‌దారులు



బుచ్చిరెడ్డిపాళెం: దామరమడుగులో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్



ముత్తుకూరు: మామిడిపూడిలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్లు

పలువురికి సన్మానం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో వీఆర్ కళాశాల విశ్రాంత ఆంధ్రభాషాచార్యుడు వెంకటస్వామిరెడ్డి, సమాజ అధ్యక్షుడు పెంచలయ్యను ఆదివారం సత్కరించారు. ఆంజనేయులు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సంఘమిత్ర విద్యాసంస్థల నిర్వాహకుడు రవీంద్రరెడ్డి, స్వచ్ఛంద సంఘ సేవకుడు సుకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): విభేదాల నేపథ్యంలో మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురంలోని భగత్‌సింగ్ కాలనీలో కామాక్షి కుటుంబం నివాసం ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన మున్నీ ఆమెకు నగదును అప్పుగా ఇప్పించారు. అప్పు తిరిగి చెల్లించడంలేదనే కారణంతో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బాబు ఇస్‌క్రీమ్స్ సమీపంలో మున్నీ నడిచి వెళ్తుండగా, కామాక్షి భర్త రాము గొడవపడి కత్తితో దాడి చేశారు. ఘటనలో మున్నీ తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు స్థానికులు తరలించారు. ఘటనపై సంతపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మనుబోలు: అవ్వాతాతల పింఛన్ మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.2,750లకు పెంచిన నేపథ్యంలో కృతజ్ఞతగా మండలంలోని జట్లకొండూరులో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు లబ్ధిదారులు, గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ మొత్తాన్ని రూ.2,750 వరకు పెంచారని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య ఎదురైనా వెంటనే పరిష్కారానికి చొరవ చూపే మంత్రి కాకాణికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ముకుంద రేణుకమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రి కాకాణిని కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు



మంత్రి కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఏపీటీఎఫ్ జిల్లా, మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, మోహన్‌దాస్, జనార్దన్‌రావు, సురేంద్ర, కాంతారావు, ఖాదర్ బాషా, మస్తానయ్య ఉన్నారు.

ఏఎస్‌పేట దర్గాలో భక్తుల సందడి



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. నూతన సంవత్సరం సందర్భంగా దర్గాను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దర్గా పీఠాధిపతి హఫీజ్‌పాషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు

- కలెక్టర్ చక్రధర్‌బాబు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఉన్నత పాఠశాల, వంటశాల, వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. అమ్మఒడి పథకం 64 మందికి రావాల్సి ఉందని విద్యార్థులు తెలియజేశారు. వెంటనే మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సాయినాథుడికి విశేషాభిషేకాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన్ సాయి ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకాలు చేశారు. మందిరంలో కొలువైన సాయినాథుడ్ని పుష్పాలు, బెలూన్లతో నేత్రపర్వంగా అలంకరించారు. సాయినాథుడి చిత్రంతో ఉన్న క్యాలెండర్, పాకెట్ ఫొటోను ఆవిష్కరించారు. సుమారు వెయ్యి మందికిపైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. మందిర గౌరవ సలహాదారు రామసుబ్బయ్య, బాబీసాయి, తదితరులు పాల్గొన్నారు.





విశేషాలంకారంలో సాయినాథుడు

ఉత్సాహంగా ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

ఇందుకూరుపేట: ఆంగ్ల సంవత్సరాది వేడుకలను మండల వాసులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. శనివారం అర్ధరాత్రి సంబరాలు జరుపుకొని నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఆదివారం ఆలయాలకు వెళ్లి తమ ఇష్టదైవాలకు పూజలు చేశారు. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా మండలంలోని గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కలెక్టర్‌కు డీసీఎమ్మెస్ చైర్మన్ శుభాకాంక్షలు

కొడవలూరు: కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబును నెల్లూరులోని కలెక్టర్ బంగ్లాలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఆదివారం కలిసి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ జిల్లాలో మెరుగైన పాలన అందించారని, నూతన సంవత్సరంలోనూ అదేవిధంగా సుపరిపాలన అందించాలని ఆకాంక్షించారు.

సంబరాలు

ముత్తుకూరు: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. కొత్త సంవత్సరంలో శుభం కలగాలని కోరుకొంటూ భక్తులు ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆంగ్ల సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ మహిళలు ఇంటి ముంగిళ్లలో అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తాళ్లపూడిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ సుగుణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

పొదలకూరు: మండలంలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, సాయిబాబా మందిరం, గీతామందిరం, వీరాంజనేయస్వామి ఆలయం, శివాలయం, విఘ్నేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు. అయ్యప్పనగర్‌లోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభగిరిపట్నం శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.



ముత్తుకూరు: భారీ కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇందుకూరుపేట: గంగపట్నంలో చాముండేశ్వరీ దేవిని దర్శించుకొంటున్న భక్తులు



కొడవలూరు: కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చలపతిరావు



పొదలకూరు: వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కళల్లో ప్రావీణ్యం సాధించాలి



ఆత్మకూరు: చిన్నారులు కళల్లో ప్రావీణ్యం సాధించాలని శృంగేరి శారదా పీఠం ఆస్థాన జ్యోతిష్య పండితురాలు జే స్రవంతి అన్నారు. పట్టణంలోని నారాయణరావుపేటలోని శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయంలో ఇటీవల నిర్వహించిన సంగీత, నృత్య పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీభారతి సంగీత నృత్యా విద్యాలయం నిర్వాహకులు వెనుకబడిన ఆత్మకూరు ప్రాంతంలోని చిన్నారులకు సంగీత, నృత్య కళల్లో శిక్షణ ఇచ్చి, వారిని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు కే అపర్ణ, శిక్షకురాలు ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రంగనాథుడి దేవస్థానంలో భక్తులు

నెల్లూరు(బృందావనం): నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు.

- నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారు, మూలవర్లు, అనివెట్టి మండపాన్ని పుష్పాలతో అలంకరించారు. ఉభయకర్తలుగా సుబ్రహ్మణ్యం, నరసింహులు, మురళి, చిన్నా, నిశాంత్, నితీష్ కుమార్ వ్యవహరించారు. బాలాత్రిపురసుందరి నృత్యనికేతన్ కామాక్షి శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యాలు అలరించాయి. అమ్మవారిని కలెక్టర్ చక్రధర్‌బాబు దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ గిరికృష్ణ, ఆహ్వాన కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నరసింహకొండలో..